ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 7 జూలై 2024

వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేయాలి

కేశంపేట, జూలై 6: తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసి రిటైరైన కావలికార్ల స్థానంలో విధులు నిర్వహిస్తున్న వారసులకు ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని మండల కావలికార్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 61సంవత్సరాలు నిండిన వీఆర్ఏలను తొలగించి వారి స్థానంలో వారసులకు ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 61ఏళ్లు నిండిన వృద్ధ వీఆర్ఏల స్థానంలో కొందరు వారసులు విధులు నిర్వహిస్తున్నారని, వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో వీఆర్ఏలు సాయిరాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.



యాచారం మండలం మేడిపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

నత్తనడకన వరినాట్లు

యాచారం మండలంలో ఈ సారి వరినాట్లు నత్త నడకన సాగుతున్నాయి. సరైన వర్షాలు లేవు, చెరువులు, కుంటల్లో నీళ్లు లేవు. భూగర్భజలాలు కూడా అడుగంటాయి. దీంతో బోర్లు కూడా వట్టిపోయాయి. రైతులు నార్లు పోసుకొని వానల కోసం ఎదురుచూస్తున్నారు. అక్కడక్కడా కొద్దిమేర పోస్తున్న బోర్ల ద్వారా రైతులు వరినాట్లు వేస్తున్నారు. అయితే, నాటు వేసినా పంట చేతికందుతుందా అన్న అనుమానంలో అన్నదాతలున్నారు. నాట్లు వేసిన తర్వాత వర్షాలు కురియకుంటే అప్పుల్లో కూరుకుపోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- యాచారం, జూలై 6



బొలెరో వాహనంలో అంతప్పగూడెం నుంచి పర్వేద పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ప్రయాణం.. ప్రమాదం

చదువుల కోసం విద్యార్థుల ప్రమాదకరమైన ప్రయాణం తప్పడం లేదు. ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో కిక్కిరిసి పాఠశాలలకు వెళ్తున్నారు. గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో వారు ఇలా ప్రయాణం చేయాల్సి వస్తోంది. చేవెళ్ల మండలం అంతప్పగూడ గ్రామానికి ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో శనివారం విద్యార్థులు కొందరు శంకర్‌పల్లి వెళ్లే బొలెరో వాహనంలో ఎక్కి పర్వేద పాఠశాలకు చేరుకున్నారు. అంతప్పగూడ నుంచి 8-10తరగతులు చదివే విద్యార్థులు కూడా పర్వేద గ్రామానికి 4 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళుతున్నారు.

- శంకర్‌పల్లి, జూలై 6

జిల్లాలో బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభించి చిన్నారికి టిఫిన్ తినిపిస్తున్న అప్పటి మంత్రి హరీష్‌రావు (ఫైల్)



విద్యార్థుల హాజరు పెంచడం.. పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండేలా చూడటం. తల్లిదండ్రులపై భారం తగ్గించడం వంటి ప్రధాన ఉద్దేశాలతో గత ప్రభుత్వం పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించడం పేద పిల్లలకు వరం లాంటిదే. గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఎన్నికలకు ముందు పూర్తిస్థాయి బడ్జెట్‌ను గత ప్రభుత్వం ప్రకటించలేదు. సరైన మార్గదర్శకాలు లేవు. దాంతో ఎన్నికల అనంతరం ప్రభుత్వ స్కూల్స్‌లో అల్పాహార పథకం అమలు కావడం లేదు. ఎలాంటి నిధులు విడుదల చేయకుండానే ఆగమేఘాల మీద పథకాన్ని ప్రారంభించింది. పథకం ప్రారంభించిన కొన్నాళ్లకే బ్రేక్‌ఫాస్ట్‌కు బ్రేక్ పడింది. బీఆర్ఎస్ సర్కార్ 2023 అక్టోబరు 6న మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలలో నాటి మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి అప్పటి మంత్రి హరీశ్‌రావు ఈ పథకాన్ని ప్రారంభించారు. అయితే, వీటికి బిల్లులు సకాలంలో విడుదల కాలేదు. ఫలితంగా నిర్వాహకులకు తలకుమించిన భారమైంది. జిల్లాలో ఈ పథకాన్ని నిలిపివేయడంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు.

- అరకొర బడ్జెట్‌తో సకాలంలో అందని బిల్లులు
- నిర్వాహకులకు చెల్లించాల్సిన బిల్లులు రూ. 85 లక్షలు
- అదనపు భారంతో నిర్వాహకులు సతమతం
- ఈ విద్యాసంవత్సరంలో అమలు కాని బ్రేక్‌ఫాస్ట్ పథకం
- బ్రేక్‌ఫాస్ట్ చేయకుండానే బడులకు, ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు
- అల్పాహారం అమలుకై కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు

పథకం అమలైతే.. జిల్లాలో లబ్ధిపొందే విద్యార్థులు..

పాఠశాల	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	881	63,000
ప్రాథమికోన్నత	181	15,500
ఉన్నత	248	65,000

ఆగిన అల్పాహారం!

ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రారంభం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 5 : గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు వివిధ పనులు, పంట చేలకు వెళ్లడంతో చాలామంది విద్యార్థులు పస్తులతోనే ఉదయం బడికి వస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెట్టేంత వరకు నిరీక్షించి నీరసించి పోతున్నారు. దీంతో ఆ సమయంలో చదువుపై శ్రద్ధ పెట్టకుండా ఉండటం, ఆరోగ్యం క్షీణించి పోతుండటంతో గత ప్రభుత్వం పాఠశాలల్లో అల్పాహార పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఇది నిలిచిపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ లేకుండానే వారు బడులకు వస్తున్నారు. మధ్యాహ్న భోజనం వరకు అలాగే ఉండాల్సిన పరిస్థితి. మొదటగా నియోజకవర్గానికి రెండు పాఠశాలలను ఎంపిక చేశారు. దసరా సెలవుల తర్వాత నవంబర్‌లో మండలానికి ఒకటి చొప్పున పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేశారు. పథకం నిర్వహణ కోసం ఒక్కో విద్యార్థికి రూ.10.50 పైసలు చొప్పున నిర్ణయించినప్పటికీ విధి విధానాలు, ఉత్తర్వులు జారీ కాలేదు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇది అదనపు భారం కావడంతో ఈ పథకాన్ని మధ్యలోనే ఆపేశారు. పాఠశాలు పునః ప్రారంభం తర్వాత జిల్లాలో ఎక్కడా బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు కావడం లేదు. జిల్లాలో 1,310 పాఠశాలల్లో 1,43,500 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ప్రారంభించినప్పటికీ.. ఇది అమలు కావడం లేదు. బ్రేక్‌ఫాస్ట్ పథకం కోసం ఖర్చు చేసిన డబ్బులు ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వక పోవడంతో నిర్వాహకులు లబోదిబోమంటున్నారు.

విద్యార్థులకు దక్కని ప్రయోజనం

సర్కారు బడుల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతున్న మాదిరిగానే అల్పాహార పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. కానీ, ఇది మధ్యలోనే నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో ఈ పథకాన్ని ముందుకు తీసుకు వెళుతుందా అన్న అయోమయం నెలకొంది.

పెండింగ్‌లో రూ.85 లక్షలు

అల్పాహారం పథకానికి సంబంధించి గత ఏడాది అక్టోబరు, నవంబర్ నెలల బిల్లులు క్లియర్ కాగా డిసెంబర్ నుంచి పాఠశాలలు ముగిసే వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు మొత్తం రూ.85 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ బిల్లుల కోసం నిర్వాహకులు ఎదురు చూస్తున్నారు.



బ్రేక్‌ఫాస్ట్ మెనూ..

వారం	వడ్డించే అల్పాహారం
సోమవారం	ఇడ్లీ+సాంబారు లేదా గోధుమ రవ్వ ఉప్మా+చట్నీ
మంగళవారం	పూరి+ఆలు కుర్మా లేదా టమాటో బాత్+సాంబారు
బుధవారం	ఉప్మా+సాంబారు లేదా బియ్యం రవ్వ కిచిడీ+చట్నీ
గురువారం	చిరుధాన్యాల ఇడ్లీ+సాంబారు లేదా పొంగల్+సాంబారు
శుక్రవారం	ఉగ్గాని/అటుకులు చిరుధాన్యాల ఇడ్లీ+చట్నీ
శనివారం	పొంగల్+సాంబారు లేదా కూరగాయల పులావ్+ పెరుగు చట్నీ/ఆలు కుర్మా

అల్పాహార సమయం : పాఠశాల సమయానికి 45 నిమిషాల ముందు

స్కూల్లో బ్రేక్‌ఫాస్ట్ పెట్టడం లేదు



గత సంవత్సరం అక్టోబరు 6 నుంచి వేసవి సెలవుల వరకు రోజూ స్కూల్లో బ్రేక్ ఫాస్ట్ తినేదాన్ని. ఇండ్లీ, ఉప్మా, కిచిడీ పెట్టేవాళ్లు. స్కూల్ పునఃప్రారంభం అయ్యాక పెట్టడం లేదు. రోజూ ఇంటి వద్దే ఉదయం తినేసి స్కూలుకు వస్తున్నాను. ఒక్కో రోజు బ్రేక్‌ఫాస్ చేయకుండానే స్కూలుకు వస్తున్నా. దీంతో ఆ రోజు ఆకలితో మధ్యాహ్నం వరకు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

- ఇర్ఫాన, 10వ తరగతి విద్యార్థిని, ఊరెళ్ల ఉన్నత పాఠశాల

బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని పునరుద్ధరించాలి



బ్రేక్‌ఫాస్ పథకాన్ని పునఃప్రారంభించాలి. గత సంవత్సరం సూల్లోనే టిఫిన్ చేశాము. ఇప్పుడు ఇంటి వద్ద తినేసి వస్తున్నాము. బ్రేక్‌ఫాస్ట్ పథకం తిరిగి ప్రారంభించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి. బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మాలాంటి పేదలక కోసం సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలి.

- నవశ్రీ, విద్యార్థిని, ఊరెళ్ల ఉన్నత పాఠశాల

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేయాలి



పేద విద్యార్థుల కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రేక్ ఫాస్ట్ పథకం బాగుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రభుత్వ బడుల్లో మాలాంటి పేద విద్యార్థుల కోసం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేయాలి. గత సంవత్సరం మా స్కూల్లోనే రోజూ ఉదయం టిఫిన్ చేసేదాన్ని, టిఫిన్ బాగుండేది. సీఎం ఆలోచించి ఈ పథకానికి నిధులు కేటాయించి అమలు చేయాలి.

- అశ్విని, విద్యార్థిని, ఊరెళ్ల ఉన్నత పాఠశాల

బిల్లులు చెల్లించక పోవడంతోనే ఆగింది



అల్పాహార పథకం ఎంతో బాగుంది. గత ఏడాది అక్టోబరు నుంచి విద్యాసంవత్సరం ముగిసే వరకు మా పాఠశాలలో అల్పాహార పథకం విజయవంతంగా అమలైంది. నిర్వాహకులకు భారమైనా మెనూ ప్రకారం టిఫిన్ పెట్టేందుకు యత్నించారు. ఒక విద్యార్థికి ప్రభుత్వం ఇచ్చే రూ.10.30కు బయట హోటల్లో కనీసం చాయ్ కూడా రావడం లేదు. టిఫిన్ వ్యయం పెంచాలి. బడ్జెట్ కేటాయించి ప్రతి నెలా సక్రమంగా చెల్లించాలి. పథకాన్ని పునరుద్ధరించాలి.

- అక్బర్, ఊరెళ్ల పాఠశాల ఉపాధ్యాయుడు

అప్పులు చేసి వండి పెట్టాను



అప్పులు చేసి పిల్లలకు అల్పాహారం వండి పెట్టాము. టిఫిన్ చేసేందుకు నెలకు రూ.23 వేల వరకు ఖర్చు వచ్చేది. బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభంలో రెండు నెలల వరకు పెద్దగా భారం అనిపించలేదు. కానీ.. తర్వాత అప్పులు తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ పథకం ద్వారా విద్యార్థులకు గత ఏడాది అక్టోబరు నుంచి స్కూల్ బంద్ అయ్యేంత వరకు టిఫిన్స్ పెట్టాము. మెనూ ప్రకారం ఇవ్వడం భారంగా మారింది. టిఫిన్ వండేందుకు ఉదయం 7 గంటలకే స్కూల్‌కు రావాల్సి వచ్చేది. టిఫిన్ వండాక మళ్లీ మధ్యాహ్న భోజనం వండేదాన్ని ఇంటికి వెళ్లే వరకు సాయంత్రం అయ్యేది. కష్టమైనా సరే వండుతాం కానీ.. బిల్లులు సకాలంలో రావడం లేదు. ఏడు నెలల బిల్లులు రూ.1.68 లక్షల వరకు రావాల్సి ఉంది.

- రేష్మ, వంట నిర్వాహకురాలు, ఊరెళ్ల పాఠశాల

సమస్యల ఒడి.. సంగెం బడి!

- సమస్యల నిలయంగా సంగెం ప్రాథమికోన్నత పాఠశాల
- 185 మంది విద్యార్థులకు నాలుగు తరగతి గదులే
- మూత్రశాలలు, మరుగుదొడ్లు కరువు
- ఇబ్బందులు పడుతున్న బాలికలు, మహిళా టీచర్లు
- సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల వేడుకోలు

కేశంపేట, జూలై 6: ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు మెరుగు పరచాలని గత ప్రభుత్వం మన ఊరు- మన బడి కార్యక్రమం తీసుకవచ్చినా ఫలితం లేకుండా పోయింది. మన ఊరు- మన బడి నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో కేశంపేట మండలం సంగెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. ఈ పాఠశాలను అభివృద్ధి చేయడానికి మన ఊరు- మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వం రూ. 88లక్షలను కేటాయించింది. ఈ నిధులతో నూతన పాఠశాల భవనంతో పాటు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ క్లాసుల ఏర్పాటుకు బిగ్ స్క్రీన్ టీవీ, విద్యార్థులు కూర్చోవడానికి అనుకూలంగా బెంచీలు, కిచెన్ షెడ్ నిర్మించాల్సి ఉంది. అయితే, కాంట్రాక్టర్ పాత భవనం కూల్చి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టి వదిలేశాడు. దీంతో పాఠశాలలో చదువుకుంటున్నా 185మంది విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఎనిమిది క్లాసులను నాలుగు తరగతి గదులలో నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా బాలికలు, ఉపాధ్యాయినులు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు పాఠశాలలో గతంలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. నీటి వసతి లేక పోవడంతో మరుగుదొడ్లను ఉపయోగించుకోలేక పోతున్నారు. పాఠశాలకు ఒక వైపు ప్రహరీ, గేటు లేకపోవడంతో విరామ సమయంలో విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. పాఠశాలకు ఇరువైపులా రోడ్డు ఉండడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడతారేమోనని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిచెన్ షెడ్ లేకపోవడంతో వంట చేయడానికి సైతం వంట ఏజెన్సీ నిర్వాహకులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల భవనాన్ని తర్వగా పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లితండ్రులు కోరుతున్నారు.



పిల్లర్లకే పరిమితమైన భవన నిర్మాణం, శిథిలావస్థకు చేరిన వంటగది



టాయిలెట్లు లేక ఇబ్బంది



మూత్ర శాలలు లేక ఇబ్బంది పడుతున్నాం. టాయిలెట్‌కు ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. టీచర్లు తెలిసిన వారి ఇంటికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలి.

-అక్షయ, విద్యార్థిని, సంగెం పాఠశాల

పాఠాలు అర్థం కావడం లేదు



మా పాఠశాల భవన నిర్మాణం త్వరగా చేపట్టాలి. మాకు తరగతి గదులు సరిపోవడం లేదు. ఒకే తరగతి గదిలో రెండు తరగతుల పాఠాలు చెబుతుండడంతో మాకు అర్థం కావడం లేదు. మా పరిస్థితిని అర్థం చేసుకుని పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి.

- అభిలాష్, విద్యార్థి, సంగెం పాఠశాల

శ్రీరామ చరిత్రను ప్రజలకు అందించడం ముఖ్యం

- ఆధ్యాత్మిక గురువు చిన జీయర్‌స్వామి
- దివ్య సాకేతంలో శ్రీమాన్ రామ యానిమేషన్ సిరీస్ ఆవిష్కరణ



శ్రీమాన్ రామ సిరీస్ యానిమేషన్ సీడీని అవిష్కరిస్తున్న చిన జీయర్‌స్వామి, రూపకర్తలు

శంషాబాద్ రూరల్, జూలై 6: శ్రీరాముడి జీవిత చరిత్ర, రామాయణ విశేషాలను ప్రజలకు అందించడం చాలా ముఖ్యమని ఆధ్యాత్మిక గురువు చినజీయర్‌స్వామి అన్నారు. శనివారం ముచ్చింతల్‌లోని శ్రీరామనగరం దివ్య సాకేతంలో శ్రీమాన్ రామ యానిమేషన్ సిరీష్ సీడీని చిన జీయర్‌స్వామి ఆవిష్కరించారు. జాతీయ అవార్డీ సత్యకాశి భార్గవ రచన, దర్శకత్వంలో హైదరాబాద్‌కు చెందిన మరా క్రియేషన్స్ రూపొందించిన శ్రీమాన్ రామ ధారావాహికను జూలై 7న ఆదివారం మధ్యాహ్నం 12గంటల నుంచి 12:30గంటల వరకు దూరదర్శన్‌లో ప్రీమియర్‌ను ప్రసారం చేయాలని నిర్ణయించినట్టు సీడీ రూపకర్తలు తెలిపారు. సత్యకాశీ భార్గవ మాట్లాడుతూ భారతీయులను మరోసారి భక్తిభావనంలో ముంచెత్తేందుకు ఆ కావ్యంలోని పాత్రలను మళ్లీ గుర్తు చేసి ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసేందుకు ఇది మరో ప్రయత్నమన్నారు. రామయణం ప్రపంచ వ్యాప్తంగా వివిధ భాషల్లో అనేక రుపాల్లో చెప్పారన్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తి, భక్తితో మరా క్రియేషన్స్ శ్రీమాన్ రామ యానిమేటెడ్ టెలివిజన్ సిరీస్‌ను అభివృద్ధి చేసిందన్నారు. ఈ సిరీస్ పూర్తి సారాంశం వాస్తవం అని వాగ్దానం చేస్తున్నామన్నారు. పిల్లల్లో యానిమేషన్‌కు క్రేజ్ ఉందని 140కోట్ల మంది జనాభాలో 40కోట్ల మంది 15ఏళ్ల కంటే తక్కువ వయస్సున్నవారేనన్నారు. వీరంతా ప్రస్తుతం సోషల్ మీడియాతో కనెక్ట్ అయి ఉన్నారని, వీరిని లక్ష్యంగా చేసుకొని మన సాంస్కృతిక చరిత్రను అందించడమే బాధ్యతగా ఈ సీరిస్‌ను రూపొందించినట్లు ప్రచారకర్త రామచంద్ర విష్ణుభట్ల తెలిపారు. ఈ ధారావాహిక సాంస్కృతిక నేపథ్యాన్ని, జీవన విలువలను అందిస్తుందని చెప్పారు. ప్రతి ఎపిసోడ్‌లో శ్రీరాముని సద్గుణాలను వర్ణించామన్నారు. విద్య, వినోదం రెండింటినీ కలగలిపి గొప్ప కథనం, అకట్టుకునే పాత్రలు, విజువల్ వండర్‌తో శ్రీమాన్ రామ భారతీయ టెలివిజన్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చిన జీయర్‌స్వామి చేతుల మీదుగా ఈ సిరీస్‌ను ప్రారంభించడం సంతోషకరంగా ఉందని దర్శక, నిర్మాతలు తెలిపారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జూలై 6: బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి తాజా మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చూడాలని బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం జరిగిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పట్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు విడుదల చేయకపోవడంతో అప్పులు చెల్లించామని తెలిపారు. వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాల్వలు, గ్రామ పంచాయతీ భవనాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, మన ఊరు-మన బడి, వైకుంఠ ధామాలు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులకు సంబంధించి కోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ దృష్టికి పెండింగ్ బిల్లుల చెల్లింపు గూర్చి తీసుకుపోయినా స్పందన లేకపోవడంతో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లువారు పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెండింగ్ బిల్లుల చెల్లింపు గూర్చి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మహేశ్వర్ రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, ఉపాధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, మల్లేశ్ ముదిరాజ్, మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీరామ్‌రెడ్డి, మెదక్‌జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, రామేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన జిల్లా న్యాయాధికారి



మేడ్చల్ టౌన్, జూలై 6 : ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా శనివారం మేడ్చల్ కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయాధికారి బాల భాస్కర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ కోర్టు జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

అద్దె చెల్లింపులపై అధికారుల గుర్రు

- ఆలయ దుకాణాలకు తాళం.. వాగ్వాదానికి దిగిన వ్యాపారులు
- పరిగి వేంకటేశ్వరాలయం వద్ద ఉద్రిక్తత

పరిగి, జూలై 6: పరిగిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన దుకాణ సముదాయం అద్దె చెల్లింపు విషయంలో అధికారులకు, వ్యాపారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్త ఉద్రిక్తతకు దారి తీసింది. శనివారం దేవాదాయ శాఖ అధికారులు మధుబాబు, శ్రీనివాసశర్మ, నరేందర్, చంద్రమోహన్, అంజనేయులు, రమేష్‌శర్మ తదితరుల బృందం పోలీసు బందోబస్తుతో ఆలయవ వద్దకు చేరుకున్నారు. దుకాణదారులు అద్దె చెల్లించడం లేదని అధికారులు షట్టర్లకు తాళాలు వేసేందుకు యత్నించారు. ఈక్రమంలో వ్యాపారులు, ఆలయ పాత కమిటీ, అధికారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 37 ఏళ్ళ క్రితం నిర్మించిన దేవాలయం రాజకీయ ఆధిపత్యం కారణంగా కొంతకాలంగా వివాదస్పదంగా మారిన విషయం విధితమే. 2016లో అప్పటి ఎమ్మెల్యే సిఫారసుతో ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలో చేర్చారు. 2018 తర్వాత అప్పట్లో ఎన్నికైన ఎమ్మెల్యే సిఫారసుతో పాత కమిటీతో ఐదేళ్లు కొనసాగింది. 2023లో తిరిగి కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన రామ్మోహన్‌రెడ్డి సూచనతో దేవాదాయ శాఖలో కలిపారు. అయితే, ఆలయ పాత కమిటీ ఈ విషయమై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. స్టే ఇచ్చింది. ఆ తర్వాత జరిగిన ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించారు. ఇదిలా ఉండగా, ఆలయానికి చెందిన దుకాణాలకు సంబంధించి వ్యాపారులు అద్దె చెల్లించడం లేదని అధికారులు నోటీసీలు కూడా జారీ చేశారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అధికారులు దుకాణాలకు తాళాలు వేశారు. వ్యాపారులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. అద్దె చెల్లించకపోతే ఎలా ఊరుకుంటామని అధికారులు ప్రశ్నించారు. తాము మొదట్లో రెండు లక్షల డిపాజిట్ చేశామని, వాటి సంగతి ఏంటని వ్యాపారులు ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువురిని సముదాయించారు. వ్యాపారులు అద్దె చెల్లించేందుకు ఒప్పకున్నారు. నాలుగు నెలలు పెండింగ్ అద్దెను చెల్లించేందుకు ఒప్పుకోవడంతో అధికారులు దుకాణాల తాళాలు తీసివేశారని దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్ తెలిపారు.



వేంకటేశ్వరస్వామి ఆలయ దుకాణాలను సీజ్ చేస్తున్న అధికారులు



దేవాదాయ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగిన వ్యాపారులు

విద్యుత్ సమస్య పరిష్కారం.. రైతుల హర్షం

కొందుర్గు, జూలై 6: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో 9 గ్రామాలకు విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య తీరింది. శనివారం ఆగిర్యాల గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఆగిర్యాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో పదేళ్లుగా ఓవర్ లోడ్ సమస్య నెలకొంది. దాంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులు సమస్యను పరిష్కరించాలని పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. మండల పరిధిలోని ఆగిర్యాల, పాత ఆగిర్యాల, ఘటియా తండా, నాగార్జున హేచరీస్, వెంకిర్యాల, లక్ష్మీదేవునిపల్లి, విశ్వనాథ్‌పూర్, తంగళ్లపల్లి, తిర్మన్‌దేవునిపల్లి గ్రామాల్లోని దాదాపు 1200 బోర్లకు సంబంధించిన రైతులు ఓవర్ లోడ్ సమస్యను ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సమస్యను తెలియజేశారు. ఓవర్ లోడ్ సమస్యను తీర్చేందుకుగాను ఆగిర్యాల 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయగా.. శనివారం ఉదయం ఏర్పాటు చేశారు. రైతులు ఎమ్మెల్యే శంకర్‌కు, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో రైతుల సమస్యలతో పాటు 9 గ్రామాల్లో కరెంట్ సమస్యలు కూడా తీరాయని విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు.



ఆగిర్యాల సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

'ఆషాఢం'.. ఆరంభం

- నేటి నుంచి అమ్మవార్లకు బోనాలు
- ఉట్టిపడనున్న సంస్కృతీ సంప్రదాయాలు

తాండూరు, జూలై 6: ఆషాఢ మాసంలో వచ్చే పెద్ద పండుగ బోనాలు. పల్లెలు, పట్టణాల్లో ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. తొలి ఆదివారం.. నేటి నుంచి ప్రారంభమయ్యే బోనాలు ఆగస్టు 4వ తేదీతో ముగుస్తాయి. దాదాపు నెల రోజులపాటు బోనాల సంబురాలు జరుగుతాయి. వేపమండలు, ఆకుల తోరణాలతో పట్టణాలు, పల్లెల్లో అమ్మవార్ల ఆలయాలను తీర్చిదిద్ది ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఇష్టదైవాలను స్మరించుకుంటూ పాటలు, భజనలు చేస్తారు. డప్పు చప్పుళ్ల, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ప్రజలు పులకించిపోతారు. ఈ సందర్భంగా సల్లంగ సూడు తల్లీ.. అంటూ ప్రజలు, భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు. కాగా, ప్రతీ ఏడాది తాండూరు పట్టణంలో కాళికాదేవి, కట్టమైసమ్మ, పాత తాండూరు బోనమ్మ వంటి పురాతమైన అమ్మవార్ల దేవాలయాల్లో బోనాలను ఘనంగా నిర్వహిస్తారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఉత్సవాలు జరుపుకుంటారు.



సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీహరి ముదిరాజ్



నియామకపత్రం అందిస్తున్న సింహాద్రి

మహేశ్వరం, జూలై 6 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం గ్రామానికి చెందిన కటికెల శ్రీహరి ముదిరాజ్ సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం నగరంలోని తార్నాకలోగల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు సింహాద్రి చేతులమీదుగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీహరి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ సమాజ్‌వాదీ పార్టీ ఆదేశానుసారం తెలంగాణలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

కౌన్సిల్ మీటింగ్ ఎప్పుడో?

- వరద ప్రాంత కౌన్సిలర్ల ఆవేదన
- నాలుగు నెలల క్రితం సమావేశమైన తాండూరు మున్సిపల్ కౌన్సిల్
- లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసి నెలరోజులైనా మీటింగ్ ఊసే లేదు!

తాండూరు, జూలై 6: తాండూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారోనని కౌన్సిలర్లు ఎదురుచూస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 19న మున్సిపల్ బడ్జెట్, సాధారణ సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్ కోడ్ నేపథ్యంలో మున్సిపల్ సాధారణ సమావేశాలు మార్చి నెల నుంచి నిర్వహించనేలేదు. దాదాపు ఐదు నెలలు గడుస్తున్నా కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడంతో కౌన్సిలర్లు ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసి నెల రోజులైంది. వర్షకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలడడంతో పాటు వరదలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం వరద సమస్యపై చర్చించేందుకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలి కదా.. ఇదేమి పాలన అంటూ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. అత్యవసరం అనుకుంటే అభివృద్ధి పనులు కాకుండా ఇతర సమస్యలపై సమావేశం నిర్వహించి చర్చించుకోవచ్చు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే పలు కాలనీలు నీట మునిగాయి. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేసి వర్ష కాలంలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, వరద ప్రాంతాల్లో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించుకోవాల్సి ఉందని, కుక్కల బెడద ఎక్కువైందని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోతే ఎలా ముందుకు వెళ్లాలని కౌన్సిలర్లు చర్చించుకుంటున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కీసర రూరల్, జూలై 6 : నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 16వ వార్డులోని చండాశ్వర్‌నగర్ కాలనీలో మున్సిపల్ నిధులు రూ.21లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, నాయకులు మోకు జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మహేశ్వరం, జూలై 6 : ఎన్నికలకు ముందు రైతాంగానికి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ కూడా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం మహేశ్వరం మండలం నాగారం లోని కుండె వెంకటేష్ వ్యవసాయ క్షేత్రంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేయడానికి కమిటీలు వేస్తుందే తప్పా.. ఆ కమిటీలు కార్యరూపం దాల్చడానికి కాదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆర్థిక తోడ్పాటు, పంటల బీమా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8, 9వ తేదీల్లో అన్ని మండల కేంద్రాల్లో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షలను విజయవంతం చేసేందుకు కిసాన్‌మోర్చా నాయకులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి ఇతర పార్టీల వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యలపై లేదన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు కిసాన్‌మోర్చా అండగా ఉంటుందని, అవసరమైతే పోరాటాలకు వెనకాడబోదన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు బస్వ పాపయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాసాని వెంకటేష్‌గౌడ్, బొక్క నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మిద్దె సుదర్శన్ రెడ్డి, కుండె వెంకటేష్, నిరంజన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డితో పాటు మాధవాచారి, పి.సుదర్శన్‌యాదవ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/నవాబుపేట, జూలై 7 : ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం రాష్ట్ర వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను నగరంలోని వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని యాదయ్య శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండలాధ్యక్షుడు, వీరేందర్‌రెడ్డి నవాబుపేట మండల నాయకులు తదితరులు ఉన్నారు.



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

లక్షలు వెచ్చించారు.. అసంపూర్తిగా వదిలేశారు

● నిలిచిపోయిన వ్యవసాయ శాఖ కార్యాలయం అదనపు గది నిర్మాణ పనులు



అసంపూర్తిగా ఉన్న అదనపు గది నిర్మాణం

ఆమనగల్లు, జూలై 6 : పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయ అదనపు గది నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనుల పూర్తి విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. దాంతో భవనం వినియోగంలోకి రాకుండాపోయింది. ఆమనగల్లు వ్యవసాయ శాఖ కార్యాలయానికి సరిపడా గదులు లేక గతంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో అదనపు గదుల నిర్మాణం గురించి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. 18 ఏళ్ల క్రితం అదనపు గది నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో కార్యాలయ పైభాగంలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి స్లాబ్ వరకు పూర్తి చేశాడు. ఆ తర్వాత కారణమేదైనా కావొచ్చుగానీ.. పనులు నిలిచిపోయాయి. నిధులు వెనక్కి మళ్లాయి. అసంపూర్తి పనులను పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని ఏళ్లకాలంగా స్థానికులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదు. దాంతో భవనం ఎందుకూ పనికిరాకుండా పోయింది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని పనులు పూర్తిచేయించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం

● జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలో

1.44 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

చౌదరిగూడ, జూలై 6 : వనమహోత్సవంలో కార్యక్రమంలో భాగంగా మండలంలో నాటేందుకు అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో నర్సరీలో 6 వేల మొక్కల చొప్పున 1.44 లక్షల మొక్కలను సిద్ధం చేసినట్లు జాతీయ ఉపాధి హామీ పథకం అధికారులు తెలిపారు. కాగా, ఒక్కో నర్సరీ నిర్వహణకు ప్రభుత్వం రూ.1.45 లక్షలు ఖర్చు చేస్తోంది. ఈనెల చివరిలోగా నర్సరీలోని అన్ని మొక్కలను నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నర్సరీల్లో పండ్లు, పూలు, ఔషధ మొక్కలు

గ్రామాల్లోని నర్సరీల్లో ఔషధ మొక్కలతో పాటు పండ్ల, పూల మొక్కలైన.. జీడి, పతంగి, ఖర్జూరా, ఈత, నీలగిరి, బాదం, రైన్‌ట్రీ, బూర్గు, అల్లనేరేడు, సుభాబుల్, గులాబీ, మల్లె, సర్వి, పారిజాతం, కరివేపాకు, గోరింటాకు, వేప, జామ, నిమ్మ, గుల్‌మొహర్, ఉసిరి, నేరేడు, చింత, సీతాఫలం, టెకోమా, కానుగ, బొప్పాయి తదితర మొక్కలు నర్సరీల్లో పెంచారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలను ప్రభుత్వ స్థలాల్లోనే కాకుండా, ఖాళీ స్థలాల్లో అధికారులు నాటేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అదేవిధంగా ప్రతీఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో నాటుకోవడానికి మొక్కలు పంపిణీ చేయనున్నారు.



పెద్దఎల్కిచర్లలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

భారీ వర్షం.. జనం బేజారు

● కొత్తూర్ అండర్‌పాస్‌లో నీట మునిగిన కారు
● బయటకు తీసిన స్థానికులు.. తప్పిన ప్రమాదం
● అండర్‌పాస్‌ను బంద్ చేసిన పోలీసులు.. వైజంక్షన్ పునరుద్ధరణ
● యాచారంలో భారీ వాన.. సాగర్-హైదరాబాద్ హైవేపై గంటన్నర పాటు రాకపోకలకు అంతరాయం



యాచారంలో కురుస్తున్న వర్షం



షాబాద్ : బోడంపహాడ్, మన్‌మర్రి గ్రామాలకు వెళ్లే రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

కొత్తూర్/యాచారం/షాబాద్, జూలై 6: మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. దాంతో జనం బేజారయ్యారు. కాగా, అధికారుల నిర్లక్ష్యం.. డిజైన్ లోపం కారణంగా కొత్తూర్ అండర్ పాస్ ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అండర్‌పాస్ రహదారి వర్షపునీటితో నిండిపోయింది. దాంతో అటుగా వచ్చిన ఓ కారు నీటిలో చిక్కుకొని పోగా, స్థానికులు గమనించి బయటకు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. కొత్తూర్ మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారి వద్ద వైజంక్షన్ నెలకొని ఉంది. హైదరాబాద్ నుంచి కొత్తూర్, షాద్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు వైజంక్షన్‌ను వద్ద క్రాస్ చేయాల్సి ఉంటుంది. అయితే, తరచూ ప్రమాదాలు సంభవిస్తుండడంతో వైజంక్షన్ సమీపంలో మూడు సంవత్సరాల క్రితం దాదాపు 12కోట్ల రుపాయలు వెచ్చించి అండర్‌పాస్ రహదారిని నిర్మించారు. సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం, డిజైన్ లోపం కారణంతో ప్రతీ సంవత్సరం వర్షకాలంలో అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలుస్తోంది. ఇటీవల అండర్‌పాస్ వద్ద మరమ్మతులు నిర్వహించడంతో.. స్థానిక పోలీసులు వైజంక్షన్ వద్ద స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారు. దాంతో హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ గుండా వచ్చి వెళ్తున్నాయి. భారీ వర్షం కారణంగా అండర్‌పాస్ వద్దకు తిరిగి వర్షపు నీరు వచ్చి చేరుతున్న సమయంలో హైదరాబాద్ నుంచి కొత్తూర్ వైపు వస్తున్న ఓ కారు వర్షపు నీటిలో చిక్కుకపోయింది. గమనించిన స్థానికులు కారును వెంటనే బయటకు తీశారు. స్థానికులు స్పందించకుంటే కారు నీటిలో చిక్కుకుని పోయేదని స్థానికులు తెలిపారు. నీటిలో చిక్కుకున్న కారులో కారు నడుపుతున్న వ్యక్తి మాత్రమే ఉన్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది అండర్‌పాస్ వద్దకు చేరుకుని వాహనాలు రాకుండా బారికేడ్లను ఏర్పాటుచేశారు. అండర్‌పాస్ మూసివేయడంతో పోలీసులు తిరిగి వైజంక్షన్ పునరుద్ధంచారు. అండర్‌పాస్ లో నిలిచిన వర్షపునీటిని ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది మోటార్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు. అదేవిధంగా యాచారం మండలంలోని యాచారం, చౌదర్‌పల్లి, నందివనపర్తి, మొండిగౌరెల్లి, గున్‌గల్, చిన్నతూండ్ల, కుర్మిద్ద, తాటిపర్తి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాలలో శనివారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది, గంటన్నర పాటు భారీ వాన కురియడంతో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై పలుచోట్ల వాహనాలు నిలిచిపోయాయి. యాచారంలో వరదనీరు నిలిచి పోవడంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా పత్తి, జొన్న తదితర పంటలకు చాలా మేలు జరగనుంది. ఖాఘా,కాగా, షాబాద్ మండల పరిధిలోని బోడంపహాడ్, మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ గ్రామాలకు వెళ్లే రోడ్డు వర్షాలకు గుంతలమయంగా మారింది. అంతారం గేటు నుంచి అప్పారెడ్డిగూడ వరకు 8 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడింది. దాంతో ఈ దారి వెంట ప్రయాణించాలంటే జనం జంకుతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలైన సంఘనటనలు చాలా ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. శనివారం కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిలవడంతో రోడ్డు మరింత పాడైపోయేలా తయారైంది.



కొత్తూర్: అండర్‌పాస్‌లో నిలిచిపోయిన కారును బయటకు తీస్తున్న స్థానికులు

సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి

● ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్
● సీవీఆర్ కాలేజీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఆదిభట్ల, జూలై 6 : ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని కఠోర శ్రమ చేయాలని.. అప్పుడే విజయం సాధిస్తారని.. సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ విద్యార్థులకు సూచించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి పరిధిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 20వ గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండు విభాగాలుగా జరిగిన కార్యక్రమానికి ఉదయం తెలంగాణ అడ్మిషన్స్ ఫీ రెగ్యులేటరీ కమిటీ చైర్మన్, జస్టిస్ ఎ.గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాశాల చైర్మన్ డాక్టర్ వెంకట రాఘవా చిరాబుడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం జరిగిన ప్రధాన కార్యక్రమానికి ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలు అందజేసి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక రంగంలో పోటీ విపరీతంగా పెరిగిందన్నారు. పోటీ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలకు అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. సాంకేతిక విద్యలో నూతన కోర్సులు వస్తున్నాయని.. ఏ కోర్సు చదివినా నిరంతరం కొత్త విషయాలు తెలుసుకుంటూ ప్రయోగాత్మక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని సూచించారు. జస్టిస్ ఎ.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల సాంకేతిక విద్య పూర్తైయిన తర్వాత కూడా జీవిత లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. బీటెక్ కోర్స్ పూర్తవుతుండగానే ఉద్యోగాలు లభిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చైర్మన్ డాక్టర్ వెంకట రాఘవా చిరాబుడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థలలో రెండు దశాబ్ధాలుగా ఎక్కడా కూడా రాజీ పడకుండా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కోర్సులు పూర్తిచేసి పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి, బంగారు పథకాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కళాశాల విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే దుస్తులలో సందడి చేశారు. కాగా, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామమోహన్‌రెడ్డి కళాశాల ప్రగతి నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.రామశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ ఎల్‌సీ శివారెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.నయనతార, అడ్వయిజర్ డైరెక్టర్ సి.మధుసూదన్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి విజయా మేయిర్, కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





ఆదిభట్ల : హాజరైన విద్యార్థులు, మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాష్ చౌహాన్

ప్రతీ విద్యార్థికి మంచి ప్లేస్‌మెంట్

మేడ్చల్ టౌన్ : తమ యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్ లభించటం ప్రశంసనీయమని మల్లారెడ్డి యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మల్లారెడ్డి యూనివర్సిటీలో మొదటి కాన్వోకేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మల్లారెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో చదువుకున్న విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్‌లు లభిస్తున్నాయన్నారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, డిజిటల్ స్టాటిస్టిక్స్‌లో పట్టాలు పుచ్చుకున్న ప్రతీ విద్యార్థికి లక్షకు తగ్గకుండా వేతనంతో ప్లేస్‌మెంట్ లభించటం సంతోషంగా ఉందన్నారు. గతంలో విశ్వవిద్యాలయాలు అంటే ఓయూ, జేఎన్‌టీయూల పేర్లను ప్రస్తావించేవారని, ప్రస్తుతం యూనివర్సిటీ అంటే మల్లారెడ్డి పేరు గొప్పగా చెప్పుకునే స్థాయికి చేరుకున్నామన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు వివిధ రంగాల్లో రాణించేందుకు విద్యను బోధిస్తూ.. వారు జీవతంలో గొప్పగా స్థిరపడే విధంగా తమ యూనిర్సిటీ విధులు నిర్వహిస్తుందన్నారు. ప్రపంచానికి కావాల్సిన మేధావులను తమ యునివర్సిటీ అందించటానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులు తమ జీవితంలో ప్రతీ విషయాన్ని ఒక సవాలుగా తీసుకుని ముందుకు సాగాలని చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలన్నదే తమ విద్యాసంస్థల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, మేనేజ్‌మేంట్, డిజిటర్ స్టాటిస్టిక్స్‌లో పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు భద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆంజనేయులు, వైస్‌చాన్సలర్ వీఎస్‌కే రెడ్డి, డైరెక్టర్లు శాలినిరెడ్డి, ప్రీతిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ టౌన్ : పట్టాలు పొందిన విద్యార్థులు

పోలీసులకు సవాల్‌గా వరుస దొంగతనాలు

● భయాందోళనలో ప్రజలు

షాద్‌నగర్ రూరల్, జూలై 6: ఇటీవల షాద్‌నగర్ పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. కాగా, వాటిని చేధించడం పోలీసులకు సవాల్‌గా మారింది. రాత్రీపగలు తేడా లేకుండా దొంగలు ఇళ్లల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు. దాంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని సాయిబాబా కాలనీలో ఒకే ఇంట్లో రెండుసార్లు దోపిడీ జరిగింది. కాలనీలో నివాసముండే శివరాం రెండు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన ఇద్దరు దొంగలు శివరాం ఇంటి తాళాలు విరగ్గొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. వరండాలో సీసీ కెమెరాలు ఉన్నాయని తెలిసి.. దొంగతనం జరిగిన తర్వాత దండుగులు సీసీ కెమెరాల డీవీఎం ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత శివరామ్‌కు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ కావడంతో కుటుంబంతో సహా మకాం మార్చారు. మళ్లీ నెలరోజుల తర్వాత దొంగలు ఆయన ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. అర్ధరాత్రి ఇంటి ఆవరణలోకి ప్రవేశించినట్లు శివరాం సీసీ టీవీ లైవ్‌ను తన ఫోన్‌లో చూసుకున్నాడు. చుట్టు పక్కల వాళ్లకు చెప్పడంతో వారు బయటకు వచ్చింది గమనించి దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన జరిగిన పది రోజుల వ్యవధిలోనే అయ్యప్ప కాలనీలో దొంగలు మరో దోపిడీకి పాల్పడ్డారు. అయ్యప్ప కాలరీ ప్రధాన వీధిలో నివాసముండే గాదం రమేష్ ఇంట్లో పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. రమేష్ భార్య, కుమారుడు, కోడలు ఆదివారం ఉదయం 7 గంటలకు కర్నూలులోని హాస్టల్‌లో ఉండే మనవడి వద్దకు వెళ్లారు. రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. దొంగతనం జరిగినట్లు గుర్తించారు. మెయిన్ డోర్ తాళం విరగ్గొట్టిన దొంగలు లోపలికి వెళ్లి మూడు బెడ్‌రూంల తాళాలు విరగ్గొట్టి రూ.2.50 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు, వస్తువులు ఎత్తుకెళ్లారు. అక్కడ కూడా డీవీఎం బాక్సును ఎత్తుకెళ్లారు. చోరీలకు ఉపయోగించిన ఇనుప రాడ్లను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. గతంలో చోరీలకు పాల్పడి జైలు కెళ్లి వచ్చిన పాత నేరస్తులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, ఆ దొంగలను పట్టుకోవడం వారికి సవాలుగా మారింది. శివారు కాలనీల్లో నివాసముంటున్నవారు మరింత ఆందోళన చెందుతున్నారు. చాలామంది పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. రాత్రి విధులకు వెళ్తుండటంతో ఇంట్లో మహిళలు, పిల్లలు మాత్రమే ఉంటారు. దాంతో తమ ఇంట్లో ఏ సమయంలో దొంగలు పడతారోనని భయాందోళన చెందుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సాయిబాబా కాలనీలో ఇంటి తలుపులను తన్నుతున్న దొంగ, వదిలివెళ్లిన ఐరన్ రాడు, స్క్రూడ్రైవర్లు(ఫైల్)

వ్యాపారులు ఫుడ్ సేఫ్టీపై శిక్షణ తీసుకోవాలి

ధారూరు, జూలై 6: ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ శిక్షణ తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా జిల్లా ఫీల్డ్ అఫీసర్ సునీత తెలిపారు. శనివారం ఆమె ధారూరు మార్కెట్‌లోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, టీస్టాల్ వ్యాపారుల వద్దకు వెళ్లి ఫుడ్ సేఫ్టీ లైసెన్సు శిక్షణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడతూ.. ఫుడ్ సేఫ్టీ లైసెన్సుపై వ్యాపారులకు అవగాహన లేదని, ఎవరి వద్ద కూడా ఈ లైసెన్సులు లేవని ఆమె తెలిపారు. కల్తీ ఆహార పదార్థాల విక్రయాల నిరోధానికి ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీపై శిక్షణ ఇస్తామని ఆమె చెప్పారు. కిరాణ దుకాణాలు, హోటళ్లు, టీ స్టాళ్లు నిర్వహించే వ్యాపారులు శిక్షణ తీసుకునేందుకు సహకరించాలని కోరారు. పంచాయతీ లైసెన్సుతో పాటు ఫుడ్ సేఫ్టీ, ఫైర్, ఎంఎస్ఎంఈ వంటి లైసెన్సులను వ్యాపారులు తీసుకోవాల్సి ఉంటుందని ఆమె వివరించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్సు వల్ల వ్యాపారులకు ప్రయోజనం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ లైసెన్సులను మీ సేవ ద్వారా తగిన రుసుం చెల్లించి పొందవచ్చని వ్యాపారులకు తెలియజేశామని, తాండూర్, వికారాబాద్ ప్రాంతాలలో కూడా క్షేత్రస్థాయిలో వ్యాపారులకు ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నామని ఆమె తెలిపారు.



కిరాణ షాపు యజమానికి రశీదు ఇస్తున్న సునీత

పల్లెల్లో పడకేసిన 'ప్రత్యేక' పాలన

● గ్రామాలకు చేరని బ్లీచింగ్ పౌడర్ ● ఫాగింగ్ కరువు.. దోమల దరువు ● ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



దోమలకు నిలయంగా మారిన బషీరాబాద్‌లోని రోడ్డు

బషీరాబాద్, జూలై 6: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రత్యేక పాలనలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల పట్ల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సమస్యలపై దృష్టి సారించడం లేదు. అసలే వర్ష కాలం.. ఆపరిశుభ్రత.. ఆపై చీకటి పడితే చాలు ఏ వార్డులకెళ్లినా దోమత మోత విన్పిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో ప్రధాన రోడ్లతో పాటు ఆయా గ్రామాల్లోని పలు వార్డుల్లోని అంతర్గత రోడ్లపై వర్షం నీరు, మురుగు కాల్వల నిండి పారిశుధ్యం లోపించడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీల్లో మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా లేక దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన వెంటనే సర్పంచులు పంచాయతీలకు బ్లీచింగ్ పౌడర్ తీసుకొచ్చి చల్లించే వారు.. కానీ ప్రత్యేకపాలనలో అదేం కనిపించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బషీరాబాద్‌లోని ప్రధాన రహదారి, పలు వార్డుల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్లపై వర్షం నీటితో పారిశుధ్యం లోపించి అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు. ప్రతియేటా వర్షకాలంలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణకు చర్యలు చేపట్టేవారిని.. ప్రస్తుతం అదేం కనిపించడంలేదని ప్రజలంటున్నారు. పలు పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నా.. ప్రత్యేక పాలనలో వాటిని ముట్టుకోవడంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీల్లో నిధుల లేమితో అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఇప్పటికైనా అధికారులు పరిశుభ్రతపై దృష్టి సారించకుంటే దోమలు మరింత వ్యాప్తిచెంది రోగాల ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



గోసాయి కాలనీలో మురుగు కాల్వ ఇలా..

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

చౌదరిగూడ, జూలై 6: రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. శనివారం మండల కేంద్రంలో చౌదరిగూడ నిర్మాణ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథి సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ ఆరంభమై నెల గడుస్తున్నా రైతు భరోసా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో రైతులకు ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వాటిని ఖాతరు చేయడం లేదన్నారు. రైతు భరోసా ఇవ్వకపోవడానికి గల కారణాలను ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బుద్దుల జంగయ్య, వెంకటేష్, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

ఘనంగా ఆంజనేయస్వామి పల్లకీ సేవ

షాద్‌నగర్, జూలై 7: షాద్‌నగర్ శివారులో ప్రసిద్ధ చౌడమ్మ గుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం కమిటీ ఆధ్వర్యంలో పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమంలో భక్తులు పాల్గొని శ్రీరామ జయ రామ, జై హనుమాన్ అంటూ పల్లకీసేవ ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలంగౌడ్, రఘుగౌడ్, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి పల్లకికి హారతిస్తున్న పూజారి, పాల్గొన్న భక్తులు

శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు, జూలై 6 : కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం కర్నూల్ జిల్లా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో కలిసి కసిరెడ్డి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు కష్టాల నుంచి వైదొలగాలని శివుడిని వేడుకున్నట్లు ఈ సందర్భంగా నారాయణరెడ్డి తెలిపారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఇన్‌చార్జి ఎంఈవో అక్బర్‌పై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి, జులై 6 : ఎస్జీటీల సీనియారిటీ జాబితాలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించని శంకర్‌పల్లి ఇన్‌చార్జి ఎంఈవో అక్బర్‌పై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని టీయూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మునీర్‌పాషా డిమాండ్ చేశారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీ నేపథ్యంలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా ప్రిఫరెన్షియల్ కేటగిరీ నిర్ధారణకు సమర్పించిన సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన ఇన్‌చార్జి ఎంఈవో నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది ఎస్జీటీలు ప్రమోషన్లు, బదిలీల అంశాల్లో నష్టపోయారన్నారు. ఇన్‌చార్జి ఎంఈవో వైఖరికి నిరసనగా శనివారం మండల వనరుల కేంద్రం వద్ద టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల జాబితాలో ఎన్నో తప్పులు దొర్లినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై వారు మండిపడ్డారు. ఎంఈఓకు సమస్యలు చెప్పుకుందామంటే ఫోన్ ఎత్తడని, కార్యాలయానికి వెళ్లినా ఉండకపోవడం ఏమిటని వారు అన్నారు. తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చిన ఉపాధ్యాయులు, వారికి సహకరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వేకెన్సీ లిస్టులో ఖాళీ పోస్టులను చూపించాలని విద్యాధికారులను కోరారు. నిరసనలో జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి, మండల నాయకులు దేవేందర్, నరేందర్‌రెడ్డి, వెకటేశ్వర్‌రావు, జగదీష్, కిరణ్‌కుమార్‌యాదవ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజాభిమానాన్ని చూరగొనాలి

కడ్తాల్, జూలై 6: ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని మండల విద్యాధికారి సర్దార్‌నాయక్, మండల నోడల్ అధికారి జంగయ్య అన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహించే ఉద్యోగులు ప్రజల అభిమానం చూరగొంటారని వారు పేర్కొన్నారు. కడ్తాల మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసి పదోన్నతిపై బదిలీ అయిన 22 మంది ఉపాధ్యాయులకు శనివారం మండల విద్యాధికారి కార్యాలయంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో సర్దార్‌నాయక్, జంగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను పూల మాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చీమర్ల రాధాకృష్ణారెడ్డి,ప్రధాన కార్యదర్శి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ఎస్సైగా వెంకటేశ్

ఆమనగల్లు, జూలై 6: ఆమనగల్లు నూతన ఎస్సైగా బి.వెంకటేశ్ నియామకం అయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పది రోజుల కిందే ఎస్సైగా నియామకమైన శ్రీనివాసులును ఆర్జీఐఏ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్ ఆమనగల్లు ఎస్సైగా రానున్నారు.

మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

● విగ్రహాలకు నాయకుల నివాళులు



కడ్తాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ జడ్పీటీసీ దశరథ్, తదితరులు



నందిగామలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కడ్తాల్/నందిగామ/తలకొండపల్లి/కందుకూరు/షాబాద్/చేవెళ్ల, జూలై 6: దళిత హక్కుల సాధన, బడుగుల ఉద్ధరణ, కులరహిత సమాజ స్థాపన కోసం అవిరళ కృషిచేసిన సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని నాయకులు కొనియాడారు. ఆయన ఆశయసాధనకు అందరు



షాబాద్: నాగర్‌గూడలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కృషిచేయాలని పిలుపునిచ్చారు. శనివారం జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, జగ్జీవన్‌రామ్ యూత్ అధ్యక్షుడు ముసలి మహేశ్‌ల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళ్లు అర్పించారు.కార్యక్రమంలో యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు మంకి శ్రీను, వెంకటేశ్, నర్సింహ, దాసు, కె.కృష్ణ, పాండు, సురేశ్, నిరంజన్, మధు, కిరణ్ పాల్గొన్నారు. నందిగామలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మాజీ జడ్పీటీసీ ఈట గణేష్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, నాయకులు బాల్‌రెడ్డి, కిష్టయ్య, వెంకటయ్య, సురేష్, స్వామి, నర్సింలు, నర్సింహ, ప్రవీణ్, గోపాల్, శ్రావణ్, శ్రీకాంత్, రాజు, అశోక్, రమేష్ పాల్గొన్నారు. తలకొండపల్లిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి అంజయ్య, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, డి.కృష్ణ, ఆరిఫ్, రాములు, వెంకట్‌రెడ్డి, రమేశ్, యాదగిరి, శేఖర్, వెంకటేశ్, మ ల్లేశ్, షాబుద్దీన్, రమేశ్ పాల్గొన్నారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి గొప్పదని కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అఫ్జల్‌బేగ్ అన్నారు. పార్టీ కందుకూరు గ్రామ అధ్యక్షుడు గాదె కుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు అజీజ్, ఢిల్లీ శ్రీధర్, జగదీష్, వెంకటేష్‌గౌడ్, వి.బాబు, డి.వెంకటేష్, సంతోష్‌కుమార్, జి.అనిల్, పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతొక్కరూ కృషి చేయాలని టీజేఎస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రామకృష్ణ అన్నారు. షాబాద్, నాగర్‌గూడ, పోతుగల్‌లలో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళ్లు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ తన 50ఏళ్ల రాజకీయ జీవితంలో 40ఏళ్లు మంత్రిగా పనిచేసిన ఓటమెర గని నేత అని కొనియాడారు. బడుగుల అభ్యున్నతికి కృషిచేశారన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ప్యాక్స్ వైస్‌చైర్మన్ మల్లేష్, నాయకులు జంగయ్య, పెంటయ్య, నర్సింహులు, రవీందర్‌నాయక్, బాల్‌రాజ్, మల్లేష్, యాదగిరి, సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్‌ను ప్రతొక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల మండల వివిధ పార్టీల నాయకులు అన్నారు. చేవెళ్ల గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు సున్నపు వసంతం, ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, బీజేపీ మండల ప్రధాన



కందుకూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాల వేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కార్యదర్శి అనంత్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు అందరం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పార్టీల నాయకులు శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, శర్వలింగం, శ్రీనివాస్, సత్యనారాయణ, ఇంద్రసేనారెడ్డి, వెంకటయ్య, పెంటయ్య, మాణిక్యం, నర్సింలు, యాదయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో ...

మాజీ ఎంపీపీకి సన్మానం



మాజీ ఎంపీపీ అనిత దంపతులకు సన్మానం

ఆమనగల్లు, జూలై 6 : పదవీ కాలం పూర్తి చేసుకున్న ఆమనగల్లు మాజీ ఎంపీపీ అనితవిజయ్‌కి మేడిగడ్డ తండాలో శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనితవిజయ్ దంపతులను యువకులు సత్కరించారు. మండల అభివృద్ధికి అనిత అందించిన సేవలను కొనియాడారు. పదవులు ఉన్నా లేకున్నా తాము ప్రజాసేవలోనే ఉంటామని అనితవిజయ్ అన్నారు. మండల ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తండా నాయకులు, యువకులు పాల్గొన్నారు.

దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలి

కడ్తాల్, జూలై 6: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు మాదిగల పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంకి వెంకటరమణ అన్నారు. ప్రభుత్వాలు మాదిగలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేయాలని కోరారు. కడ్తాలలో శనివారం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఉద్యమం మొదలై 30ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించే దండోరా రజతోత్సవాలకు నాయకులు, కార్యకర్తల తరలింపుపై చర్చించారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్లను నాయకులతో కలిసి వెంకటరమణ ఆవిష్కరించారు. వేడుకలకు మాదిగలు ఉప్పెనలా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రవి, రామస్వామి, ప్రవీణ్, కృష్ణ, రమేశ్, నరేశ్, వసంత, సాలమ్మ, పాల్గొన్నారు.



రజతోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వేముల్‌నర్వలో గీతా పారాయణం

కేశంపేట, జూలై 6: వేముల్‌నర్వలో గీతాపారాయణం నిర్వహించారు. తొమ్మిదిరేకులకు చెందిన కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో శ్యామల కవిత-శివకుమార్‌గౌడ్‌ల గృహంలో గీతా పారాయణం, లక్ష్మీఅష్టోత్తరం, చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తిభావాన్ని చాటేందుకు కిషన్ ప్రభుధర్మ ప్రచార సమితి అధ్యాత్మిక కార్యాక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనసూయమ్మ, కిషన్‌జీ, మల్లేష్, జంగయ్య, రవి, రాములు, ప్రతాప్‌రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.



పారాయణంలో పాల్గొన్న భక్తులు

రాష్ట్ర కుమ్మరుల తొలి బోనాల జాతరకు తరలిరావాలి

కందుకూరు, జూలై 6: తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న తలపెట్టనున్న కుమ్మర్ల తొలి బోనాల జాతరకు సంఘం సభ్యులు తరలిరావాలని సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు శేరిగూడెం జయ్యమ్మ పిలుపునిచ్చారు. శనివారం జైత్వారంలో నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం నగరంలోని లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద మధ్యాహ్నం 12:30గంటలకు తాము తొలి బోనాలు తీస్తామన్నారు.మండలంతో పాటు జిల్లాలోని కుమ్మరులంతా తరలిరావాలని పిలుపునాచ్చారు. కార్యక్రమంలో కె.అలివేలు, కె.సత్తమ్మ, కె.బాలమణి, కె.లక్ష్మమ్మ, కె.శాంతమ్మ, కె.సత్తమ్మ, కె.సభద్ర, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా కుమ్మరి సంఘం మహిళా నాయకులు

వృథా భూములు, పొలం గట్లపై మొక్కలు నాటుతాం



మొక్కలు నాటేందుకు గున్‌గల్‌లో కూలీలు తవ్విన గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం/చేవెళ్ల, జూలై 6 : యాచారం మండలంలోని గ్రామాల్లో హరితహరం కింద లక్ష మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. రోడ్లవెంట, వృథా భూముల్లో, పొలంగట్లపై పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుతాం అన్నారు. శనివారం గున్‌గల్‌లో ఓ వెంచర్‌లోని పంచాయతీ స్థలంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయించారు. వర్షాలు కురవాలంటే మొక్కలు పెంచాలన్నారు. యువత, ప్రజాప్రతినిధులు మొక్కల సంరక్షణకు కృషిచేయాలన్నారు. 24పంచాయతీల్లో 60 రకాల మొక్కలున్నట్లు చెప్పారు. ఇళ్ల పరిసరాల్లో పూలమొక్కలు నాటుకోవాలని చెప్పారు. ఇప్పటి వరకు 31,845 గుంతలు తీయించామన్నారు. వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణం పాడుకోవాలని చేవెళ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టేనవతి తెలిపారు. స్కూల్‌లో స్కూల్ ఎర్త్ క్లబ్- యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా కౌన్సి ల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థ పా ఠశాల ఆవరణలో ఔషధ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..విద్యార్థులకు పరిపూర్ణ ఆరోగ్యానికి, జ్ఞాపశక్తి సామర్థ్యం పెంపునకు ఉపయోగపడే ఔషధ మొక్కలను నాటడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ నగేశ్, సభ్యులు వంశీధర్‌రెడ్డి, ఆస్మా, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



చేవెళ్లలోని మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

ఆమనగల్లు ఎక్సైజ్ పరిధిలో 25వేల మొక్కలు పెంచుతాం

ఆమనగల్లు, జూలై 6:రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 25వేల మొక్కలను నాటి సంరక్షించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. శనివారం ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో మొక్కలు నాటేందుకు నర్సరీల్లో ఈత, ఖర్జూర, తాటి తదితర మొక్కలు ఉన్నాయన్నారు. గీత కార్మికులు, రైతులు మొక్కలు కావాలంటే కార్యాలయంలో సంప్రదించి మొక్కలు తీసుకెళ్లవచ్చని అన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటుతాం అన్నారు.



మాట్లాడుతున్న సీఐ బద్యానాథ్

శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

మంచాల/నందిగామ/షాద్‌నగర్/చేవెళ్ల, జూలై 6 : దేశ సమైఖ్యత కోసం అహర్నిశలు శ్రమించిన దేశభక్తుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ అని, దేశానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జి.లచ్చిరెడ్డి కొనియాడారు. జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని శనివారం బీజేపీ మండల కార్యాలయంలో



మంచాల : బీజేపీ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి

మొక్కలు నాటారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ విలీనానికి ప్రాణ త్యాగం చేసిన ఆదర్శప్రాయుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య, ప్రధాన కార్యదర్శులు రాజు, రాజేందర్‌రెడ్డి, యువ మోర్చా అధ్యక్షుడు రాజు, సురేష్, నర్సింహ, వెంకటేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, పూర్ణచంద్ర పాల్గొన్నారు. నందిగామలో శ్యామాప్రసాద్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేపల్లి అశోక్‌గౌడ్, చెన్నయ్య, ప్రవీణ్, క్రిష్ణమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లోని తన నివాసంలో కార్యకర్తలతో కలిసి శ్యామాప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్యామాప్రసాద్ కృషివల్లే జనసంఘ్ ఏర్పాటైందని, జనసంఘ్ వల్లే బీజేపీ ఆవిర్భవించిందన్నారు. ముఖర్జీ పోరాటం వల్లనే కాశ్మీర్‌లో 370జీవో రద్దు సాకారమైందని గుర్తు చేశారు. అనంతరం బాలాజీ టౌన్‌షిప్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, ఆకుల ప్రదీప్, వెంకటేష్ పాల్గొన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా నాయకులు ఆంజనేయులుగౌడ్, కుంచం శ్రీనివాస్‌గుప్తా అన్నారు. చేవెళ్లలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. భారత జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ అని చెప్పారు. దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధాన మంత్రులు, రెండు జాతీయ పతాకాలు ఉండకూడదని.. అదరికీ ఒకే పౌరస్మృతి ఉండాలని ఆకాంక్షించిన మహోన్నత వ్యక్తి శ్యామాప్రసాద్ ముఖర్జీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, మచ్చుందర్ రెడ్డి, ఎ.శ్రీనివాస్, దేవుని శర్వలింగం, శ్రీనివాస్, సాయి, అశోక్ ఉన్నారు.



చేవెళ్లలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా వెంకటేష్‌గౌడ్



నియామక పత్రం అందుకుంటున్న ఎల్గని వెంకటేష్‌గౌడ్

మొయినాబాద్ రూరల్, జూలై 6: బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా ఎల్గని వెంకటేష్‌గౌడ్ నియమితులయ్యారు. బాకారం జాగీర్‌కు చెందిన వెంకటేష్‌గౌడ్‌కు బీజేపీ ఓబీసీ కార్యవర్గంలో జిల్లా కార్యదర్శి పదవి దక్కింది. ఓబీసీ సెల్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, దుద్దాల లక్ష్మీనారాయణ నగరంలోని పార్టీ కార్యాలయంలో వెంకటేష్‌గౌడ్‌కు శనివారం నియామకపత్రాన్ని అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని వెంకటేష్‌గౌడ్ చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, ఈశ్వరప్ప, కంజర్ల ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే రత్నం, ఆంజనేయులు, అత్తపురం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మాణయ్య

షాబాద్, జూలై 6 : మండల పరిధి తిమ్మారెడ్డిగూడకు చెందిన మద్దూరి మాణయ్య బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా, కార్యవర్గ సభ్యులుగా నరేడ్లగూడకు చెందిన శ్రీశైలం ఎన్నికైనట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. నియామకపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న శ్రీశైలం

ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ప్రశాంత్‌గౌడ్



నియామక పత్రం అందుకుంటున్న ప్రశాంత్‌గౌడ్

షాద్‌నగర్, జూలై6:రంగారెడ్డి జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యుడిగా షాద్‌నగర్‌కు చెందిన ప్రశాంత్‌గౌడ్ నియమితులయారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా కార్యాలయంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీ అధిష్ఠానం తనకు ఈ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రశాంత్‌గౌడ్ నియామకం పట్ల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

మొయినాబాద్ రూరల్, జూలై 6:హిమాయత్‌నగర్‌లో నిత్యం విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శేఖర్ తదితరులు చిలుకూరు సెక్టార్ విద్యుత్ ఏఈ రాజేష్‌బాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతోందన్నారు. అలాగే గ్రామంలో చేతికందేఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని కోరారు. ఏఈకి వినతిపత్రం ఇచ్చిన వారిలో రజాక్, నవీన్‌కుమార్, సందీప్, ప్రవీణ్ ఉన్నారు.

వేతనాలు పెంచాలని హ్యాచరీస్ కార్మికుల ఆందోళన



వెంకటేశ్వర హ్యాచరీస్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

కేశంపేట, జూలై 6:మండల పరిధి కొత్తపేట శివారలోఓ గల వెంకటేశ్వర హ్యాచరీస్ కార్మికులు శనివారం ఆందోళన చేశారు. హ్యాచరీస్‌లో ఇస్తున్న వేతనాలు తమకు సరిపోవడంలేదని, వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ గేటు వద్ద బైఠాయించారు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు సౌకర్యాలతో పాటు వేతనాలు పెంచాలన్నారు. ఆందోళనలో కార్మికులు శ్రీశైలం, ఆంజనేయులు, కుమార్, రఘు, శ్రీకాంత్, రవి, జంగయ్య, యాదయ్య, గుండాల రాములు, జంగమ్మ, అంజమ్మ, అరుణ, మంగమ్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, జూలై 6: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మల్కాపూర్‌లో పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్తుల కోసం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి వారు వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నరేందర్‌గౌడ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరు మృతి

కందుకూరు జులై 6: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి కందుకూరు పరిధి హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై దెబ్బడగూడ గేటు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం లింగసానిపల్లెకు చెందిన సంపంగి మల్లయ్య(36) బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. దెబ్బడగూడ గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన కారు మల్లయ్య బైక్‌ను ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌ను ఢీకొన్న అనంతరం కారు ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. కారులో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



సుహాసిని

చేవెళ్ల, జూలై 6: భర్తతో గొడవ పడి అమ్మగారింటికి వచ్చిన మహిళ 40 రోజుల నుంచి కన్పించకుండా పోయింది. ఈ సంఘటన చేవెళ్ల మండలం గుండాల పరిధి సాయిరెడ్డిగూడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిరెడ్డిగూడకు చెందిన సుహాసిని(28)ని నగరంలోని జీడిమెట్ల షాపూర్‌నకు చెందిన వ్యక్తికిచ్చి కొన్నాళ్ల క్రితం పెళ్లిచేశారు. సుహాసిని భర్తతో గొడవపడి మే నెలలో సాయిరెడ్డిగూడకు వచ్చింది. అప్పట్లో భర్త తీసుకెళ్తానని చెప్పినా వెళ్లలేదన్నారు. ఈ క్రమంలో మే 26 నుంచి సుహాసిని కన్పించకుండా పోయింది. కుటుంబ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సుహాసిని తల్లి స్వరూప శనివారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.